nipuna
Every Wednesday Free Supplement
05.
24 ఏప్రిల్ 2024
పేజీలు 8

## మహారాష్ట్రలో తెలుగు అకాడమీ

మహారాష్ట్ర తెలుగు సాహిత్య అకాడమీ స్థాపనకు మహారాష్ట్ర క్యాబినెట్ మార్చి 18న ఆమోదం తెలిపింది. క్యాబినెట్ సమావేశంలో తెలుగు, బెంగాలీ, సంస్కృత సాహిత్య అకాడమీల ఏర్పాటుకు ఆమోదం లభించింది. తెలుగు సాహిత్య అకాడమీ ఏర్పాటు కోసం గతేడాది ఏప్రిల్‌లో వివిధ ప్రాంతాలకు చెందిన కవులు, రచయితలు, కళాకారులు మంత్రి సుధీర్ మునిగంటివార్‌కు వినతిపత్రం అందజేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం చాలా ఏండ్లుగా ఒకటి నుంచి పదో తరగతి వరకు తెలుగు భాషలో పాఠ్య పుస్తకాలు అందిస్తుంది.

## మినిమం ఇన్‌పుట్.. మ్యాగ్జిమం అవుట్‌పుట్

**కష్టాన్ని నమ్ముకొని చదివితే ఏదైనా సాధించవచ్చని యూపీఎస్సీ సివిల్స్ ఫలితాల్లో ఆలిండియా 27వ ర్యాంక్ సాధించిన నందాల సాయికిరణ్ నిరూపించాడు. సాఫ్ట్‌వేర్ జాబ్ వదిలి సివిల్స్‌వైపు రావడానికి, ర్యాంక్ సాధించడానికి చదివిన విధానం తదితర విషయాలు ఆయన మాటల్లో..**

**కుటుంబ నేపథ్యం**

- మాది కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెలిచాల గ్రామం. నాన్న నందాల కాంతయ్య, తల్లి లక్ష్మి. అక్క స్రవంతి. నాన్న మహారాష్ట్రలోని భీవండిలో పవర్‌లూమ్స్ కార్మికుడిగా పనిచేస్తుండగా క్యాన్సర్ బారిన పడటంతో స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. అమ్మ బీడీలు చుడుతూ వచ్చే ఆదాయంతోనే మమ్మల్ని చదివించింది. తండ్రి మరణించడంతో తల్లి పడే కష్టం చూసి బాగా చదువుకుని స్థిరపడాలని నిర్ణయించుకున్నాం. అక్క స్రవంతి బాసర ట్రిపుల్ ఐటీలో చదివి మిషన్ భగీరథలో ఏఈఈ ఉద్యోగం సాధించింది. ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలో ఆర్‌డబ్ల్యూఎస్‌లో విధులు నిర్వహిస్తుంది.

**జాబ్ చేస్తూ..**

- కుటుంబ పరిస్థితుల దృష్ట్యా బీటెక్ తర్వాత కోర్ సబ్జెక్టుతో జాబ్‌లో చేరాను. జాబ్ చేస్తూనే సివిల్స్‌కు ప్రిపేరయ్యాను. తొలి ప్రయత్నం విఫలం కావడంతో ఉద్యోగం వదిలేసి ప్రిపేర్ కావాలనుకున్నాను. కానీ ఉన్న ఉద్యోగం వదులకుంటే ఇబ్బందులు ఉంటాయని బంధువులు చెప్పడంతో ఉద్యోగం చేస్తూనే ప్రిపరేషన్ కొనసాగించాను. సివిల్స్ కొట్టి లక్ష్యం నెరవేర్చుకుంటానని బంధువులకు చెప్పేవాడిని. ఆ నమ్మకంతోనే చదివి రెండో ప్రయత్నంలో 27వ ర్యాంకు సాధించాను.

**విద్యాభ్యాసం**

- ఒకటి నుంచి నాలుగో తరగతి వరకు వెలిచాల గ్రామంలోని సరస్వతి పాఠశాలలో, ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు తేజ స్కూల్ కరీంనగర్‌లో, ఇంటర్ ట్రినిటీ కరీంనగర్‌లో, ఎన్ఐటీ వరంగల్‌లో బీటెక్ (ఈసీఈ) చదివాను. తర్వాత క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో క్వాల్కమ్ కంపెనీలో ఉద్యోగం సాధించాను.

సాయికిరణ్
27వ
ర్యాంక్



**సివిల్స్ వైపు రావడానికి కారణం**

- అధికారిగా ఉంటే సమాజానికి సేవ చేయవచ్చనే సంకల్పంతో సివిల్స్ ఎంచుకున్నాను. నాకు ఎవరూ ఇన్‌స్పిరేషన్ లేరు. సమాజానికి సేవ చేయాలనే దృఢ సంకల్పంతోనే సివిల్స్‌ను ఎంచుకున్నాను.
- సివిల్స్ మొదటిసారి 19 మార్కులతో మిస్సయ్యాను. అప్పుడు చదవడానికి సమయం దొరకక మిస్ అయ్యాను.

**ప్రిపరేషన్**

- ఐదు సంవత్సరాల నుంచి హైదరాబాద్‌లో హార్డ్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాను. సివిల్స్‌కు రెండు సంవత్సరాల నుంచి ప్రిపరేషన్ మొదలు పెట్టాను. ఎలాంటి కోచింగ్ లేకుండా సొంతంగా ప్రిపరేషన్ మొదలుపెట్టాను. ప్రిలిమ్స్ మాక్‌టెస్ట్‌లు ఎక్కువగా పెట్టుకుని ప్రాక్టీస్ చేశాను. మాక్‌ప్రాక్టీస్ ద్వారా అనుభవం వచ్చింది. లక్ష్మీకాంత్, స్పెక్ట్రం, జీసీ లియాంగ్, దీపక్ సింగ్ వంటి వారి ప్రామాణిక పుస్తకాలను చదివాను. సమయం దొరికినప్పుడల్లా సీరియస్ గా ప్రిపేరయ్యాను.వీకెండ్‌లో పూర్తి సమయం చదవడానికే కేటాయించాను.

**ఇంటర్వ్యూ**

- డి దాసా ప్యానెల్ నన్ను ఇంటర్వ్యూ చేసింది. సుమారు 30 నిమిషాల పాటు ఇంటర్వ్యూ జరిగింది.
- చాలా డైవర్స్‌డ్ టాపిక్స్‌పై ప్రశ్నలను అడిగారు. ముఖ్యంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అంశాలు, ద్రవ్యోల్బణం, మేధోవలస లాంటి అంశాలపై ప్రశ్నలు అడిగారు.
- తెలంగాణ అంశాలపై ప్రశ్నలు అడగలేదు

**సివిల్స్ రాసే వారికి సూచనలు, సలహాలు**

- ముఖ్యంగా కోచింగ్ తీసుకోకుండా కూడా సివిల్స్‌లో ర్యాంక్ సాధించవచ్చు. గతంలో టాపర్స్‌గా నిలిచిన వారి సలహాలు, సూచనలతోపాటు వారి బ్లాగ్స్/టెలిగ్రామ్ చానల్స్‌లో నోట్స్, రకరకాల మెటీరియల్ పెడుతున్నారు. అదేవిధంగా విజన్ ఐఏఎస్, తునియా ఐఏఎస్ వంటి కోచింగ్ సెంటర్స్ వారు కూడా ఉచితంగా కరెంట్ అఫైర్స్ తదితర అంశాలను వారి వెబ్‌సైట్స్‌లో పెడుతున్నారు. అవి చాలా ఉపయోగపడతాయి.
- ప్రామాణిక పుస్తకాలు తప్పనిసరిగా చదవాలి. ప్రిపరేషన్ కొంత స్థాయికి వచ్చిన తర్వాత టెస్ట్ సిరీస్ తప్పకుండా రాయాలి. ఎంత ఎక్కువగా టెస్ట్ సిరీస్ రాస్తే అంత మంచిది. అదేవిధంగా ప్రీవియస్ పేపర్స్‌ను విశ్లేషించుకుని ప్రిపరేషన్ కొనసాగించడం చాలా ముఖ్యం.
- హార్డ్‌వర్క్+ స్మార్ట్ వర్క్ చేయాలి. ఏ అంశాలపై ఫోకస్ చేయాలి అనేది తెలుసుకోవాలి. లేకుంటే మహాసముద్రం లాంటి సిలబస్‌తో విజయం సాధించడం కష్టమవుతుంది.
- మినిమం ఇన్‌పుట్‌తో మ్యాగ్జిమం అవుట్‌పుట్ సాధించేలా ప్లాన్ చేసుకోవాలి. ఎవరైనా లక్ష్యం పెట్టుకుంటే ఆత్మవిశ్వాసం, మనోధైర్యంతో చదివితే దేన్నయినా సాధించవచ్చు.
- భవిష్యత్‌లో నేను టెలిగ్రామ్ చానల్, వివిధ ప్లాట్‌ఫాంల ద్వారా సివిల్స్‌రాసే వారికి నా ప్రిపరేషన్ విధానం, నోట్స్ తదితర అంశాలన్నింటిని అందిస్తాను. వారి విజయానికి నా వంతు సహాయం చేస్తాను.

**ఐఏఎస్‌గా...**

- సమ్మిళిత అభివృద్ధి జరగడానికి నా వంతు కృషి చేస్తాను. అభివృద్ధి ఫలాలు అందరికీ అందేలా పనిచేస్తాను.

**బొడిగె వెంకటేశ్, చొప్పదండి**

## అమ్మ మాటతో ఐఏఎస్ బాట..

**అమ్మ నోట వచ్చిన 'ఐఏఎస్' మాటను అక్షరాలా నిజం చేశాడు. చిన్నప్పటి నుంచి సివిల్సే లక్ష్యంగా ముందుకు సాగాడు. తెలిసిన ఐఏఎస్‌లను కలుసుకొని కలెక్టర్ చదువుకు బాటలు వేసుకున్నాడు. తొలి ప్రయత్నంలో ర్యాంకును ఒడిసి పట్టి ఎంతో మందికి ఆదర్శంగా నిలిచాడు జనగామకు చెందిన మెరుగు కౌశిక్. ఆయన గెలుపు ప్రయాణ విశేషాలను చెప్పుకొచ్చాడిలా..**

**కుటుంబ నేపథ్యం?**

- మాది జనగామ జిల్లా జనగామ పట్టణం. నాన్న మెరుగు సుధాకర్ నిర్మాణ రంగ వ్యాపారం చేస్తారు. అమ్మ సుజాత గృహిణి. అక్క ఉంది.

**విద్యాభ్యాసం?**

- పదో తరగతి, ఇంటర్ హైదరాబాద్‌లో, బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ ఓయూ క్యాంపస్‌లో, ఎంబీఏ ఐఐఎఫ్‌టీ ఢిల్లీ నుంచి పూర్తి చేశాను. అనంతరం సంవత్సరంపాటు క్యాప్‌జెమినిలో ఫైనాన్షియల్ కన్సల్టెంట్‌గా ఉద్యోగం చేశాను. సివిల్స్ ప్రిపరేషన్‌కు ఉద్యోగం అడ్డంకిగా ఉందని తెలుసుకొని దానికి రాజీనామా చేశాను. వెనక్కి తిరిగి చూడకుండా సీరియస్‌గా చదవడం ప్రారంభించాను.

**ప్రిపరేషన్ ఎలా సాగింది, చదివిన మెటీరియల్?**

- 2022, జనవరి నుంచి ప్రిపరేషన్ ప్రారంభించాను. ప్రతిరోజు సుమారు 8 గంటలు చదివాను. సొంతంగానే ప్రిపరేషన్ కొనసాగించాను. జాగ్రఫీకి NCERT మెటీరియల్, పాలిటీ–లక్ష్మీకాంత్, హిస్టరీ–స్పెక్ట్రమ్, ఎన్విరాన్‌మెంట్–శంకర్ ఐఏఎస్ అకాడమీ, కరెంట్ అఫైర్స్ కోసం దినపత్రికలు, మ్యాగజైన్స్ చూసేవాడిని. ఇంటర్వ్యూ గైడెన్స్ కోసం బాలలత మేడం, వికాస్ కనుకొల్లును సంప్రదించాను. ఒత్తిడి సమయాల్లో స్నేహితులతో మాట్లాడటం, క్రికెట్ ఆడుతూ మానసిక ప్రశాంతత పొందాను.

మెరుగు కౌశిక్
82వ
ర్యాంక్

**తొలి ప్రయత్నంలోనే సివిల్స్ సాధించడం ఎలా అనిపిస్తుంది?**

చాలా సంతోషంగా ఉంది. సివిల్స్ సన్నద్ధతకు ఓపిక, శ్రద్ధ ఉండాలి. ఎంచుకున్న లక్ష్య సాధన కోసం కొందరు నాలుగైదు సార్లు అయినా ప్రయత్నాన్ని విరమించరు. నాన్నకు తెలిసిన ఐఏఎస్, ఐపీఎస్‌లను కలుసుకుని పరీక్షలకు ఎలా సన్నద్ధమవ్వాలో తెలుసుకున్నాను. ప్రిపరేషన్ ప్రణాళిక, నా శ్రమే మొదటి ప్రయత్నంలో ర్యాంకు వచ్చేలా చేశాయి. 'ఐఏఎస్' అని ఒకటుంటుందని చిన్నప్పటి నుంచి మా అమ్మ చెప్పేది. ఎల్లప్పుడూ వెన్ను తట్టి ప్రోత్సహించింది.



వరంగల్‌లో ఎస్పీగా పని చేసిన ఎల్‌కేవీ రంగారావును చూసి స్ఫూర్తి పొందాను. దాంతోనే నా అడుగులు ఇటువైపు పడ్డాయి.

**ర్యాంకు, ఎంచుకున్న ఆప్షనల్ సబ్జెక్టు?**

- కుటుంబ సహకారం, నా చిన్నప్పటి నుంచి సివిల్స్ లక్ష్యం కావడంతో శ్రద్ధగా చదివి 82వ ర్యాంకు సాధించాను. అసలు 100 లోపు ర్యాంకు వస్తుందని అనుకోలేదు. సోషియాలజీ ఆప్షనల్ సబ్జెకు. ఐఏఎస్ సర్వీసు వస్తుంది. సర్వీసులో చేరాక నిబద్ధతతో పని చేస్తూ ముందుకెళ్తాను.

**ఇంటర్వ్యూ విశేషాలు, అడిగిన ప్రశ్నలు?**

- దినేష్ దాసా బృందం ఇంటర్వ్యూ చేసింది. సోషియాలజీ, 2015 బడ్జెట్ అంశాలు, ప్రభుత్వ రంగంపై అభిప్రాయం, నాకు ట్రావెలింగ్ హాబీ ఉండటంతో ఆ విషయాలు, ట్రేడ్‌కు సంబంధించిన తదితర ప్రశ్నలు అడిగారు. అన్నింటికి సమాధానమిచ్చాను. 31 నిమిషాలపాటు ఇంటర్వ్యూ కొనసాగింది.

**సర్వీస్‌లో చేరాక ఏం చేయదలచుకున్నారు?**


- ముఖ్యంగా దివ్యాంగులకు సేవ చేయాలనుంది. ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కలిగించే పనులకు ప్రాధాన్యమిస్తాను. ప్రతి పనిలో నా వంతు బాధ్యతను నిర్వర్తిస్తాను. పేదవారికి సాయం చేసేందుకు ముందువరుసలో ఉంటాను.

**భవిష్యత్‌లో ప్రిపేరయ్యేవారికి మీ సలహాలు, సూచనలు?**

- యూపీఎస్సీకి పక్కా ప్రణాళిక అవసరం. దాని ప్రకారమే కష్టపడి చదవాలి. మానసికంగా సిద్ధంగా ఉండాలి. ఇంతకుముందు టాపర్లుగా నిలిచిన వారితో మమేకమయ్యే ప్రయత్నం చేయాలి. సక్సెస్ ఇంటర్వ్యూలు చూసి లోపాలు సవరించుకోవడం ఉత్తమం. తక్కువ సమయంలో అనుకున్న ఫలితం పొందేందుకు వీలుంటుంది. అప్పుడే విజయం మనల్ని హత్తుకుంటుంది.

## తండ్రి స్ఫూర్తితో సివిల్స్ వైపు

**తండ్రి వ్యవసాయ శాఖలో సైంటిస్టుగా పనిచేస్తున్న క్రమంలో ప్రజలు, రైతులకు సూచనలు, సలహాలతోపాటు కలెక్టర్ లాంటి ఉన్నతాధికారులతో మాట్లాడే తీరును గ్రహించాడు. తండ్రి స్ఫూర్తితో, చిన్నప్పటి లక్ష్యంతో, ప్రజా సేవ చేయాలనే సంకల్పంతో సివిల్స్ రాసి 104వ ర్యాంక్ సాధించాడు రావుల జయసింహారెడ్డి. విజయ ప్రస్థానం అతడి మాటల్లో..**




**కుటుంబ నేపథ్యం**

- మాది హనుమకొండ నగరంలోని పోస్టల్ కాలనీ విద్యుత్ నగర్. నాన్న రావుల ఉమారెడ్డి వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో సహ పరిశోధన సంచాలకుడిగా పని చేస్తున్నాడు.

మిగతా 6వ పేజీలో

**సీహెచ్ సత్యనారాయణ, హనుమకొండ**